క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: ప్రయాణికులకు, పాదచారులకు దాహార్తిని తీర్చే సదుద్దేశంతో రహదారి పక్కన చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొడ్డు రామారావు అన్నారు. ఆదరణ అనాథ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో గుంటూరు రోడ్డులోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.ఇంద్రసేన, రిషితాను ఆయన అభినందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కేబీఆర్కే ప్రసాద్, లియోరాజు, సురేష్, సైదులు, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కవాతు



ముప్పాళ్ల: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై పి.హజరత్తయ్య కోరారు. మండలంలోని తురకపాలెం, కొంకావారిపాలెం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. ప్రతి ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించి, ఓటు ప్రాధాన్యతన వివరించారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ సీఎం జగన్



సత్తెనపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే కరువుకు కేరాఫ్ చంద్రబాబు అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో గురువారం ఆమె ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. అంబటి విజయలక్ష్మికి వార్డులో మహిళలు హారతులు పట్టి, ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి, మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, 20వ వార్డు కౌన్సిలర్ కుకుట్ల లక్ష్మి, కో–ఆప్షన్ మెంబర్లు తుమ్మల లక్ష్మీ సుజాత, కొనతం స్వాతి, నాయకులు కూకట్ల శ్రీను, దాసరి తిరుపతి రావు, తోట సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

పెదకూరపాడు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి మండలంలోని హుస్సేన్ నగరంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమం కొనసాగించాలని ఇంటింటికి వెళ్లి కోరారు. సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్ కుమార్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

అందుకూరు(క్రోసూరు): అందుకూరులో నంబూరు వసంతకుమారి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

క్రోసూరు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.మేరీ సుజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియెట్ వరకు ఇంగ్లీషు మీడియంలో ఎలాంటి ఉచిత విద్యనభ్యసించవచ్చని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, మోడల్ స్కూల్‌లోని పరీక్ష కేంద్రానికి ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ రాసే విద్యార్థులు ఈ నెల 24వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని, ఇంప్రూవ్‌మెంట్‌కు కూడా ఫీజు గడువులోగా చెల్లించాలని ప్రిన్స్‌పాల్ తెలిపారు.

పట్టణంలో తాగునీటి సరఫరా బంద్

నరసరావుపేట: పట్టణానికి శాంతినగర్ నుంచి తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు ఏర్పడిన లీకును సరిచేసే నిమిత్తం పట్టణంలో నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం, సాయంత్రం తాగునీటి సరఫరా ఉండదన్నారు. ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.

రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- చంద్రబాబు ఇచ్చే హామీలు నమ్మొద్దు
- మెగా బైక్ ర్యాలీ విజయవంతం
- 24న నామినేషన్‌కు ప్రతి ఒక్కరూ తరలిరావాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పార్టీ శ్రేణులతో కలిసి మెగా బైక్ ర్యాలీలో మంత్రి అంబటి రాంబాబు, తనయ అంబటి మనోజ్ఞ

సత్తెనపల్లి: మోసకారి చంద్రబాబు హామీలు నమ్మొద్దు అని, రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఈ నెల 24న వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన జన సమీకరణలో భాగంగా గురువారం సత్తెనపల్లి టౌన్ నుంచి మెగా బైక్ ర్యాలీ నిర్వహించారు. వెన్నాదేవి, ధూళిపాళ్ల మీదుగా రాజుపాలెం మండలం రెడ్డిగూడెం, రాజుపాలెం, చౌటపాపాయపాలెం, అనుపాలెం, కొండమోడు, పెదనెమి లిపురి, శ్రీనివాస్ నగర్ కాలనీ మీదుగా నకరికల్లు చేరుకున్నారు. నకరికల్లు లో అల్పాహారం అనంతరం చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట, పమిడిపాడు, మొలకలూరు మీదగా ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు, ముప్పాళ్ళ, ఇరుకుపాలెం మీదుగా సత్తెనపల్లి టౌన్‌కి చేరుకున్నారు. మెగా బైక్ ర్యాలీలో భాగంగా గ్రామ గ్రామాన పర్యటిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన సంక్షేమం , అభివృద్ధిని తెలియజేశారు. మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మంత్రి అంబటి రాంబాబుకు హారతులు పట్టి, ఘన స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికల సన్నద్ధానికి అశేష సైన్యం తన వెంట నిలిచిందని, ఊహించని రీతిలో మెగా బైక్ ర్యాలీ విజయవంతమైందని మంత్రి అంబటి సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 24న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి నామినేషన్ దాఖలు చేయనున్నానని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మెగా బైక్ ర్యాలీలో ఆయా గ్రామాల్లోని నాయకులను చైతన్యపరిచి నామినేషన్ కార్యక్రమం గురించి వివరించారు. ప్రజా బలం లేక ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాయని మంత్రి అంబటి ఈ సందర్భంగా మండిపడ్డారు. వీరు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి తనయ అంబటి మనోజ్ఞ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్ రెడ్డి, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, యాసారపు బాబు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: మండలం నుంచి సుమారు 550కి పైగా ద్విచక్ర వాహనాల్లో కార్యకర్తలు మంత్రి రాంబాబు ర్యాలీలో పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం నుంచి పెదనెమలి పురి వరకు సుమారు 3వేల ద్విచక్ర వాహనాలతో మంత్రి అంబటి ర్యాలీ జరిగింది. రెడ్డిగూడెంలోకి ప్రవేసించగానే ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి మహిళలతో కలసి వారికి హారతులిచ్చారు. మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాస రెడ్డి, రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ ఆదినారాయణ, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు తదితరులు స్వాగతం పలికారు.

అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన తప్పనిసరి



డెయిరీలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ధూళిపాళ్ల గ్రామంలోని దొడ్ల డెయిరీలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలో డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డెయిరీ హెచ్‌ఆర్ మేనేజర్ ఇ.విశ్వనాథరెడ్డి, ప్లాంట్ మేనేజర్ కె.రమేష్, సత్తెనపల్లి అగ్ని మాపక కేంద్ర సిబ్బంది ఎం.మోహన్ బాబు, కె.శ్రీనివాసరావు, రమణ నాయక్, నాగేశ్వరరావు, హోంగార్డు బాజీ, డ్రైవర్ సాగర్ బాబు పాల్గొన్నారు.

కూటమి కూసాలు కదిలేలా..

- పెదకూరపాడులో టీడీపీ, జనసేన ఖాళీ అయ్యేలా వైఎస్సార్ సీపీలోకి చేరికలు
- జనసేనకు భారీ గండి.. ముస్లిం మైనార్టీల సంపూర్ణ మద్దతు
- పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే శంకరరావు సాదర ఆహ్వానం..



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మద్దతుదారులైన దొడ్లేరు ముస్లింలు

బెల్లంకొండ: మండల కేంద్రమైన బెల్లంకొండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు బుధవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన గుర్రాల షేక్ అబ్దుల్ నబీ, కారసాల ఈసూబ్ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు కుల మతాలకు అతీతంగా అందించిన సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పని చేస్తామన్నారు. ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, సిరిపురం మేస్త్రి, దరియా, బడాబచ్చా, మౌలాలి పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండల కేంద్రమైన పెదకూరపాడు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుమారుడు నంబూరు కళ్యాణ్ చక్రవర్తి ఆహ్వానించారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల పార్టీ కన్వీనరు షేక్ మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీలోనే గుర్తింపు

అచ్చంపేట : ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీలోనే సముచిత స్థానం ఉంటుందని, అందువల్లే ముస్లిం సోదరులంతా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలొని కస్తల గ్రామానికి చెందిన ముస్లింలు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంకరరావు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన వారిలో షేక్ మస్తాన్, నాగులు, షరీఫ్, అబ్దుల్ రజాక్, షరీఫ్ ఉమర్ బాష, ఇస్మాయిల్, అల్లాభక్షు, దరియావలి, ముబిన్, అయాడ్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో కస్తల గ్రామ సర్పంచ్ షేక్ మాబూసుభాని, అచ్చంపేట సర్పంచ్ షేక్ జానీ, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు తదితరులు న్నారు.

అమరావతి: మండల కేంద్రంలోని గాజులపాలేనికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకుడు నంబూరు కళ్యాణ్ చక్రవర్తి సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. గాజులపాలెంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సయ్యద్ బుడెసాహెబ్, జైబుమ్, జానీబాషా, రణహూస్సేన్, ఉద్దండుసైదులు, రఫీ, జహీరున్నిసా, నాగుల్ షరీఫ్, షేక్ జానీ, సయ్యద్ హజరాబీ, సకీనమ్మ, కులసం బీ, బాజీ, జిడుగు జానీ, గౌషా, జాకీరా, బూరన్, షాకీరా, బాబు, షాహీనా, ఎస్కే రఫీ, ఎస్కే షాహీనా, కారసాల సాగర్, సునీతతో పాటుగా మొత్తం 50 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా అహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హష్మీ, అల్లాబక్షు, బాబు, నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా జనసేన నుంచి భారీగా చేరికలు

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరంలో జనసేన పార్టీకి చెందిన 50 కుటుంబాలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయ్యవరం గ్రామంలో గతంలో జరిగిన అభివృద్ధికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి తేడా గమనించాలని స్థానికులను కోరారు. తనను గెలిపిస్తే బయ్యవరం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో తోట చిన అక్కయ్య, శిరసాని గోపయ్య, కడియం ఆంజనేయులు, కడియం సంజీవరావు, శిరసాని చినమల్లయ్య, బుర్రి వెంకట్రావు, కొసనా శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, తోట నరసింహారావు, కంబాల చంద్రయ్య, కటికోల సూర్యనారాయణ, పూజల నాగేశ్వరరావు, శిరసాని వెంకటేశ్వర్లు, కోయా తిరుపతిరావు, తులం అనిల్, నిమ్మల కోటేశ్వరరావు, కంబాల శివనాగేశ్వరరావు, పగడాల కొండయ్య, తోట దత్తాంజనేయులు, వాసా నరేంద్ర, సిద్ధి దుర్గారావు, శిరసాని గోవిందు, మేడిశెట్టి పుల్లయ్య, చందు శేషయ్య, చందు పాములయ్య, కంబాల పెద్ద ఆదియ్య, కడియం నాగేశ్వరరావు (నారయ్య), కొతారు కోటేశ్వరరావు (రోశయ్య) తదితరులున్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

- మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ ఏనుగుపాలెం సైదా, షేక్ నాగూర్ బాష, సయ్యద్ మస్తాన్ వలి, సయ్యద్ జాన్, పిన్నెల్లి మహబూబ్ సుభాని, షేక్ మస్తాన్ వలి, షేక్ నరవాడ చిన్న నాగుల్ మీరా, బిస్మిల్లా షేక్, సయ్యద్ మస్తాన్ వలి, షేక్ మహబూబ్ మెహరాజ్ తదితరులున్నారు.
- క్రోసూరు మండలం ఎర్రబ్రాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తలు నీరుకొండ గోపాలకృష్ణ, కుప్పాల వెంకటేష్ వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే శంకరరావు వారిని పార్టీలోకి ఆహ్వానించారు.
- క్రోసూరు మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బొల్లెద్దు కృష్ణ, బొల్లెద్దు లక్ష్మి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఎంపీపీ పి.కోటయ్య, వెలదిఅప్పారావు, గార్లపాటిదాసు ఉన్నారు.

అచ్చంపేట నుంచి జనసేన నాయకులు

అచ్చంపేట : అచ్చంపేట మండలంలో జనసేన పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం ఓర్వకల్లు గ్రామానికి చెందిన జనసేన నాయకులు బూరె భద్రయ్య, దొంకల సాంబయ్య తను అనుచరులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుచే వైఎస్సార్ సీపీ కండువాలు కప్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కళ్యాణ్ చక్రవర్తి



పార్టీలో చేరిన కస్తల గ్రామ ముస్లింలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు



గాజులపాలెంలో టీడీపీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న కళ్యాణ్ చక్రవర్తి



వైఎస్సార్ సీపీలో భారీగా చేరిన బయ్యవరం జనసేన కార్యకర్తలు



వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

వలంటీర్ల రాజీనామా



నకరికల్లు: రాజీనామాలు చూపుతున్న చల్లగుండ్ల గ్రామ వలంటీర్లు..



రాజీనామా పత్రాలతో అచ్చంపేట వలంటీర్లు

సత్తెనపల్లి: టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు మనస్తాపం చెందిన సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన ముగ్గురు వలంటీర్లు గురువారం తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి అందజేశారు. అలాగే అబ్బూరు నుంచి 14 మంది, ధూళిపాళ్ల నుంచి ఒకరు, కంటేపూడి నుంచి 8 మంది, లక్కరాజుగార్లపాడు నుంచి 14 మంది, వెరశి 37 మంది రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో జగదీష్‌కు అందించారు.

వలంటీర్ల వరుస రాజీనామాలు

నకరికల్లు: మండలంలోని గ్రామ సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. గురువారం ఒక్కరోజే చల్లగుండ్ల గ్రామం నుంచి 30 మంది, కుంకలగుంట నుంచి 16 మంది, చాగల్లు గ్రామం నుంచి 11 మంది మొత్తం 57 మంది రాజీనామాలు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో తమ రాజీనామా పత్రాలు అందజేశారు.

అచ్చంపేటలో 40మంది వలంటీర్లు..

అచ్చంపేట: మండలంలోని అచ్చంపేట–1, 2 సచివాలయాల పరిధిలోని 40 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడి రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేశారు. ప్రజలకు సేవలందిస్తున్న తమను అగౌరవ పరచడం టీడీపీ అధినేత చంద్రబాబుకు, జనసేన పవన్ కల్యాణ్‌ల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

రుద్రవరంలో ఆరుగురు వలంటీర్లు..

ముప్పాళ్ళ: మండలంలోని రుద్రవరం గ్రామ సచివాలయం పరిధిలోని ఆరుగురు వలంటీర్లు తమ రాజీనామాలను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు రాప్రోలు మాధవరెడ్డి, ఇసిరెడ్డి పున్నారెడ్డి, గొనం కృష్ణవేణి, తలపుల ఏడుకొండలు, మార్పులు నాగార్జునరెడ్డి, షేక్ జానీ తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

కూటమికి జనసేన షాక్

- వైఎస్సార్ సీపీలోకి క్యూ కడుతున్న జనసేన నాయకులు
- ప్రచారానికి దూరంగా కొమ్మాలపాటి వర్గం
- భాష్యం ప్రవీణ్ తీరుపట్ల టీడీపీ నేతల అసంతృప్తి
- టీడీపీ పొత్తు ఎత్తులు చిత్తు

అచ్చంపేట : పెదకూరపాడు నియోజకవర్గంలోకూటమికి ఎదురుగాలి వీస్తోంది. కూటమిలో ప్రధానంగా జనసేనకు పట్టున్న గ్రామాల్లో ఆపార్టీ నాయకులు ఒక్కొక్కరుగా వైఎస్సార్‌సీపీకి క్యూకడుతున్నారు. నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఊసే లేకుండా పోయింది. టీడీపీ టిక్కెట్ ఆశించి భంగపడ్డ కొమ్మాలపాటి వర్గీయులు ప్రచారంలో అంటీ అంటనట్లు వ్యవహరిస్తున్నారు. టీడీపీ, జనసేన బలం కలిస్తే రెట్టింపు బలం అవుతుందని ఊహించిన టీడీపీకి జనసేన నాయకులు ఒక్కొక్కరుగా దూరం అవడం మైనస్ అయితే దూరమైన జనసేన నాయకులంతా వైఎస్సార్‌సీపీలో చేరడం ప్లస్‌గా మారింది. కాపు సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న గ్రామాలన్నింటినీ టీడీపీ తమ ఖాతాలో వేసుకుని గెలుస్తామని సంబరపడింది. కాని పవన్ కళ్యాణ్‌ను సీఎంగా చూడాలన్న కాపు సామాజిక వర్గ కోరిక తీరే పరిస్థితులు కనిపించడం లేదు. తొలుత 50 సీట్లు ఇస్తారని ఊహించిన కాపులు ఆ సంఖ్య 24కు తగ్గడం, కూటమిలో బీజేపి కలయికతో 24 కాస్తా 21కి తగ్గింది. ఆ 21లో కూడా చంద్రబాబు తెలివిగా తన పార్టీ వారినే 10మందిని జనసేన తరపున పోటీలో ఉంచడంతో ఇక మిగిలిన 11 సీట్లలో గెలిచే సీట్లు ఎన్నో అర్థంకాని పరిస్థితి కాపు సామాజికవర్గాన్ని తీవ్రంగా బాధిస్తోంది. చంద్రబాబు ఇంత మోసం చేస్తున్నా ఇక ఆ పార్టీలో ఉండి ఎంత మాత్రం లాభం లేదని, సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే వైఎస్సార్‌సీపీకి వెళ్లడం మంచిదని జనసేనానిలు, వీరమహిళలు భావిస్తున్నారు. అచ్చంపేట మండలంలో జనసేనకు అనుకూలంగా ఉన్న చెరుకుంపాలెం, చిగురుపాడు, అచ్చంపేట, ఓర్వకల్లు, మాదిపాడు తదితర గ్రామాలకు చెందిన కాపు నేతలంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇప్పటివరకు పవన్ సీఎం అవుతారన్న నమ్మకంతో జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి దేశెట్టి అనంతరామయ్య తన సొంత ఖర్చుతో జనసేన పేరుపై సిమెంటు బెంచీలు చేయించి ప్రధాన గ్రామాలకు విరాళంగా ఇచ్చారు. ఆ పార్టీ పేరుతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అలాంటి నాయకులను కూడా కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పట్టించుకోకపోవడాన్ని జనసేన నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. చంద్రబాబు మోసానికి బలైన తమ నాయకుని ప్రవర్తనకు విసుగెత్తిన అనంత రామయ్య తన అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన దారిలోనే మరికొంతమంది నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు పయనించారు. మరికొంతమంది పయనించేందుకు సిద్ధంగా ఉన్నారు. కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తీరు పట్ల టీడీపీ నాయకలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జనసేన నాయకులు ఒక్కొరొక్కరుగా జారిపోవడాన్ని జీర్ణించుకోలేని ప్రవీణ్ అసహనానికి లోనై సంయమనం కోల్పోతున్నారు. ఓవైపు పసుపు, రెండోవైపు తెలుపు కండువాలు ధరించి ప్రచారనికి వచ్చే తన నాయకుడిని చూసి టీడీపీ ప్రధాన సామాజికవర్గం ముక్కున వేలేసుకుంటోంది. ఇలా అయితే వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు శంకరరావుపై గెలవడం అటుంచి, కనీస పోటీ అయినా ఇచ్చి పరువు దక్కించుకునే పరిస్థితులున్నాయా అనే అనుమానాలు ఆ పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి.

మంచి జరిగితేనే ఓటేయండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చామని, అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించామన్నారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు. మండలంలోని కస్తల గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. అవ్వాతాతలకు పింఛను మంజూరు చేసి, అక్కచెల్లెమ్మల డ్వాక్రా రుణాలు మాఫి చేశామన్నారు. రైతన్నలకు పెట్టుబడి నిధులు ఇచ్చి, ప్రతి కుటుంబానికి మేలు చేశామని పేర్కొన్నారు. ఒక్క సారి ప్రజలు ఆలోచించాలని, ప్రతి కుటుంబానికి మంచి జరిగిందనుకుంటేనే ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, సేవచేసే అవకాశాన్ని మరోసారి ఇవ్వాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రజలను కోరారు. జెడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ షేక్ మాబూసుభాని, చెన్నమల్లు రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అభయాంజనేయస్వామి 35వ వార్షికోత్సవ తిరునాళ్ల ను గురువారం నిర్వహించారు. ఉదయం నుండే మహిళా భక్తు లు పొంగళ్లు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. ఆకుపూజలాంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను స్వామి వారికి నిర్వహించారు. భక్తులు భజనా కార్యక్రమాలు చేశారు. మరి కొందరు భక్తులు మజ్జిగ, పులిహోరా, లడ్డూ, పానకం ప్రసాదాలను పంపిణీ చేశారు. తిరునాళ్లలో రొంపిచర్ల పోలీసులు శాంతి భద్రతల పర్యవేక్షణ నిమిత్తం బందోబస్తు ఏర్పాటు చేశారు.